సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 15 । మే । 2025



కుటుంబ 'సమ్మె'తంగా..
వైఎస్సార్ కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)ల సమ్మె కొనసాగుతోంది. - 8లో



అల్లదిగో.. వేంకటేశ్వరుడు!
విశ్వావసు నామ సంవత్సరం వైశాఖ మాసం లో జరిగే శ్రీ నారపురస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /28.0

వాతావరణం
జిల్లాలో బుధవారం 28.0 – 40.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

చేవ లేక...చేతగాక..!

ప్రభుత్వ నిర్ణయంపై కార్పొరేటర్ల ఆగ్రహం

కడప కార్పొరేషన్ : అవిశ్వాసం పెట్టే చేవలేక...చేతగాక చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని మేయర్ సురేష్‌బాబుపై ప్రభుత్వం దొడ్డిదారిన అనర్హత వేటు వేసిందని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో స్థానిక సంస్థల్లో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులను గద్దెదించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మండిపడుతున్నారు. అభిప్రాయాలు వారి మాటల్లోనే...

మేయర్ ఎన్నిక సమయంలోనే ఇవన్నీ చూడాలి



మేయర్‌ను ఎన్నుకునే సమయంలోనే వారికి కాంట్రాక్టులు ఉన్నాయా? వారి కుటుంబ సభ్యులకు కాంట్రాక్టు ఉన్నాయా? అన్న విషయాలను పరిగణలోకి తీసుకోవాలి. మేయర్ ఎన్నిక పూర్తయి 2023లో వర్ధిని కన్‌స్ట్రక్షన్ సంస్థ పుట్టింది. వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ రిజిస్ట్రేషన్‌ను అధికారులు రద్దు చేసి ఉండాలి. బీసీ నాయకులనే లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం వారిని పదవుల నుంచి తప్పిస్తోంది.

– బసవరాజు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాస్వామ్యం ఖూనీ



కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. కడప నగర పాలక సంస్థలో 50 స్థానాలకుగాను 49 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఉన్నారు. మేయర్‌ను ఏమి చేసుకోలేక ఎనిమిది మంది కార్పొరేటర్లను అన్ని విధాలుగా భయపెట్టి, మభ్య పెట్టి టీడీపీలో చేర్చుకున్నారు. మేయర్ కుమారుడు చేసిన కాంట్రాక్టు పనుల్లో అవినీతి జరిగిందని విజిలెన్స్ విచారణలో చెప్పలేదు.

– మల్లికార్జున, 10వ డివిజన్ కార్పొరేటర్

మేయర్‌పై దొంగదెబ్బ!



కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి పాతరేసింది. కార్పొరేషన్‌లో సీటు వేయలేదనే అక్కసుతో కుతంత్రాలకు తెరలేపింది. నిస్సిగ్గుగా రోత ఫిరాయింపు రాజకీయాలు చేసింది. అయినా తాము అనుకున్న లక్ష్యం నెరవేరదని తెలుసుకుని దొంగదెబ్బ తీసింది. ఎలాంటి అవినీతి రుజువుకాకున్నా మేయర్‌పై అనర్హత వేటు వేయించి అక్కసు వెళ్లగక్కింది. కడపగడపలో దుష్ట సంస్కృతికి తెరలేపిన నేతగా ఎమ్మెల్యే మాధవి చరిత్రలో నిలిచిపోనుంది.

- సురేష్‌బాబుపై కక్షగట్టిన ఎమ్మెల్యే మాధవిరెడ్డి
- అధికారుల తప్పిదాన్ని బూచిగా చూపెట్టి ప్రభుత్వం ద్వారా చర్యలు
- కార్పొరేషన్‌లో రూ.36లక్షల కాంట్రాక్టు పనులు చేశారని అనర్హత వేటు



కడప కార్పొరేషన్ కార్యాలయం (ఇన్‌సెట్) మేయర్ సురేష్ బాబు

సాక్షి ప్రతినిధి, కడప : కడప మేయర్ సురేష్‌బాబుపై దొంగదెబ్బ కొట్టారు. కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ సంస్థ రూ.36 లక్షలు కాంట్రాక్టు పనులు చేశారని బూచిగా చూపెట్టి అనర్హత వేటు వేశారు. ఆమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెంబర్ 446 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే మాధవీరెడ్డి అక్కసుతో దొంగ దెబ్బతీశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోలేమని అంచనాకు వచ్చిన తర్వాత, ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకున్నారు. అధికారం అడ్డుపెట్టుకొని అనర్హత వేటు వేశారని విశ్లేషకులు భావిస్తున్నారు.

కడప కార్పొరేషన్‌లో లేని ప్రొటోకాల్ కావాలని ఎమ్మెల్యే మాధవి రెడ్డి పట్టుబట్టారు. సాధ్యపడకపోవడంతో కడప మేయర్ సీటుపై కన్నేశారు. ఎలాగైనా కైవసం చేసుకోవాలనే అంచనాకు వచ్చారు. సామ బేధ దండోపాయాలను ప్రయోగించినా 8మంది కార్పొరేటర్లు మాత్రమే మొగ్గు చూపారు. అవిశ్వాసంతో దింపలేమని స్పష్టమైంది. లొసుగులు, లోటుపాట్లుపై దృష్టి పెట్టారు. మేయర్ సురేష్‌బాబు తనయుడు అమరేష్ కాంట్రాక్టు సంస్థను రిజిస్టర్ చేసుకున్న విషయాన్ని పసిగట్టారు. కాంట్రాక్టు అనుభవం కోసం చేసిన పనులను బూచిగా చూపెట్టారు. ముందుగా కార్పొరేషన్‌ను అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు చేశారు. విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటుకు ఫిర్యాదు చేశారు. పనుల్లో ఎలాంటి అవినీతి లేదని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ధ్రువీకరించింది. మున్సిపల్ యాక్టుపై దృష్టి సారించారు. అధికారంలో ఉన్న మేయర్ కుటుంబ సభ్యులు కార్పొరేషన్‌లో పనులు చేపట్టరాదనే ఫిర్యాదు ఆధారంగా ప్రభుత్వం ద్వారా చర్యలు చేపట్టారు.

అధికారులపై చర్యలేవీ....

ఆగమేఘాలపై మేయర్ సురేష్‌బాబుపై చర్యలు తీసుకున్న ప్రభుత్వ పెద్దలు కారకులైనా అధికారులను విస్మరించారు. మేయర్ మాత్రమే టార్గెట్‌గా వ్యవహరించారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మేయర్ కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న కాంట్రాక్టు సంస్థ కార్పొరేషన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటుంటే అభ్యంతరం చెప్పాల్సింది ఎవరు? చట్టం తెలిసిన అధికారులే కదా? మున్సిపల్ నిబంధనలు ప్రకారం కార్పొరేషన్‌లో పనులు చేయరాదంటూ అభ్యంతరం చెప్పాలి కదా? ఎందుకు అభ్యంతరం చెప్పలేదనే ప్రశ్న ఉదయిస్తోంది. అప్పటి అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ కోణం స్పష్టంగా కన్పిస్తోందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. పైగా కార్పొరేషన్ పరిధిలో రూ.10లక్షల లోపు పనులు అధికారుల కనుసన్నుల్లోనే చేపట్టనున్నారు, స్టాండింగ్ కమిటీ దృష్టికి కూడా రావు. రూ. 50లక్షల పైబడిన పనులు మాత్రమే జనరల్ బాడీకి చేరనున్నాయి. మరోవైపు రూ.36లక్షల కాంట్రాక్టు పనుల్లో ఎలాంటి అవినీతి లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు నివేదికలు ఇచ్చాయి. అయినా ఇలా అనర్హత వేటు వేయడం రాజకీయంగా దొంగదెబ్బ కొట్టడమేనని పలువురు వెల్లడిస్తున్నారు.

ఆగమేఘాలపై చర్యలు...

ప్రభుత్వం మేయర్‌పై అనర్హత వేటు వేయాలనే దిశగా అడుగులు వేస్తున్నట్లు మొదటి నుంచి స్పష్టమౌతోంది. మేయర్‌గా సురేష్‌బాబుకు నోటీసు అందకముందే టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవి రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి నోటీసులు మీడియాకు చూపెట్టడం తెలిసిందే. పైగా మంగళవారం సాయంత్రం మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్‌బాబును విచారించారు. మేయర్ తన వివరణ ఇచ్చిన 24గంటలు కూడా గడవకమునుపే అనర్హత వేటు ఉత్తర్వులు వెలువడడం గమనార్హం. సీఎంఓ డైరెక్షన్‌లో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పనిచేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

వ్యూహాత్మకంగా సర్కార్ అడుగులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెద్ద పీట వేశారు. 51శాతం స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు ప్రాతినిథ్యం వహించాలని సంకల్పించారు. క్షేత్రస్థాయిలో అమలు పర్చారు. మరోవైపు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లుతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు అదే బీసీ, ఎస్సీలను లక్ష్యం చేసుకొని దొడ్డిదారిన దెబ్బకొడుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. వైజాగ్, గుంటూరు మేయర్, తిరుపతి డిప్యూటీ మేయర్, మాచర్ల మున్సిపల్ చైర్మన్ స్థానాలను కైవసం చేసుకున్న తీరును వారు వివరిస్తుండడం విశేషం.

బీసీ నేతపై కక్షసాధింపు చర్యలు



బీసీ నేత కడప మేయర్ సురేష్‌బాబును తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టింది. తన కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న సంస్థ ద్వారా కాంట్రాక్టులు పొందారని ఆరోపణలతో మేయర్ పదవినుంచి తొలగిస్తూ జీఓ జారీ చేయడం అన్యాయం. ఈచర్య పూర్తిగా రాజకీయ కక్షసాధింపే. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అణచివేత ధోరణిని అవలంబిస్తోంది. అందులోనూ ముఖ్యంగా బీసీ నేతలపై చర్యలు చేపట్టడం విడ్డూరంగా ఉంది.

– డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

ఎమ్మెల్యేను ఎంతో గౌరవించాం



ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కడప ఎమ్మెల్యే మాధవీకి కార్పొరేటర్లంతా ఘనంగా స్వాగతం పలికి ఎంతో గౌరవించారు. కానీ ఆమె మమ్మల్ని చులకన భావంతో చూసింది. ఇచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకోకుండా మేయర్ ఇంటిపై చెత్త వేయించింది. ఎక్స్ అఫిషియో సభ్యులకు నిబంధనల ప్రకారం ఎక్కడ కుర్చీ వేయాలో అక్కడే వేశారు. దాన్ని ఎమ్మెల్యే అవమానంగా భావించి ఇలా రాద్ధాంతం చేయడం దారుణం.

– రామలక్ష్మణ్‌రెడ్డి, 13వ డివిజన్ కార్పొరేటర్

ఎమ్మెల్యేకు కుర్చీ మాత్రమే కావాలి



ఎమ్మెల్యే మాధవికి మేయర్‌తో సమానంగా కుర్చీ మాత్రమే కావాలి. ప్రజా సమస్యలు అక్కర్లేదు. కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకునేందుకు వారి హోటళ్లపై దాడులు చేయించింది. వాటర్‌ప్లాంట్లను కూల్చి వేయించేందుకు ప్రయత్నించింది. ఇవన్నీ సఫలం కాకపోవడంతో చట్టంలోని లొసుగులను అడ్డు పెట్టుకుని మేయర్‌పై అనర్హత వేటు వేయించారు. కార్పొరేషన్‌లో ఎమ్మెల్యేకు ఎక్కడా అవమానం జరగలేదు. ఆమెకై ఆమె అవమానం జరిగినట్లు ఊహించుకుని కక్ష సాధిస్తోంది. న్యాయస్థానంలో పోరాటం చేసి అదే స్థానంలో కూర్చొబెడతాం.

– ఐస్‌క్రీమ్ రవి, 23వ డివిజన్ ఇన్‌ఛార్జి

అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ



మేయర్‌పై ప్రభుత్వం అనర్హత వేటు వేయడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ. ఇలా చిన్న చిన్న విషయాలను అడ్డు పెట్టుకుని పదవి నుంచి తొలగించడం అప్రజాస్వామికం. అధికారం చాన్నాళ్లు ఉండదన్న సత్యాన్ని టీడీపీ నాయకులు గ్రహించాలి.

– త్యాగరాజు, 26వ డివిజన్ ఇన్‌చార్జి

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి అధ్యక్షతన జెడ్పీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈనెల 8వ తేది జెడ్పీ సమావేశం నిర్వహించాలని తొలుత నిర్ణయించినప్పటికీ మంత్రివర్గ సమావేశం కారణంగా ఈనెల 15వ తేదికి వాయిదా వేసిన విషయం విదితమే. సమావేశానికి జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరు కానున్నారు.

ఎన్ఎంఆర్‌ల దినసరి వేతనాల పెంపు

కడప సెవెన్‌రోడ్స్ : వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎన్ఎంఆర్/కంటిజెంట్, దినసరి కార్మికులకు కనీస వేతనకమిటీ సిఫార్సుల ప్రకారం దినసరి వేతనాలను పెంచుతున్నామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కార్మికశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నైపుణ్యం లేని కార్మికులకు రోజుకు రూ. 551, మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్నవారికి రూ. 574, కార్పొరేషన్‌లో పనిచేస్తున్న వారికి రూ. 596 చొప్పున కనీస వేతనాలు నిర్ణయించామన్నారు. పాక్షిక నైపుణ్యం గల కార్మికులు గ్రామాల్లో పనిచేస్తుంటే రూ. 600, మున్సిపల్ పరిధిలో రూ. 624, కార్పొరేషన్ పరిధిలో రూ. 648గా నిర్ణయించామని వివరించారు. నైపుణ్యంగల కార్మికులు పై క్యాడర్లలో పనిచేస్తుంటే వారికి రూ. 655, రూ. 681, రూ. 707 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. వేతనాల పెంపు ఉత్తర్వులు తక్షణమే అమలులోకి రావాలని కార్మికశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఉప కార్మిక కమిషనర్ (ఎఫ్ఏసీ) శ్రీకాంత్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఇతర అదికారులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలి

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయచోటిలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో రూ.10 లక్షలతో రీ మోడల్ చేసిన ఎస్ఈ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. కొత్తగా అన్నమయ్య జిల్లా ఏర్పడిన సందర్భంగా రాయచోటిలో ఏపీఎస్పీడీసీఎల్ నూతన ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం అనర్థాలపై అవగాహన ముఖ్యం

కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధ్వర్యంలో కేర్ (కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్)పై ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆల్కహాల్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కేర్ కమిటీ ఏర్పాటైందన్నారు. ప్రతి మద్యపాన వినియోగదారునికి వాటి వల్ల కలిగే అనారోగ్య సమస్యలను తెలియజేసే విధంగా మద్యం షాపుల్లో కరపత్రాలు అందజేయాలని అధికారులకు సూచించారు. మద్యపాన వినియోగంపై అవగాహన సదస్సులు, చర్చాగోష్టులు, మాబ్లు, ప్రదర్శనలు, మద్యపానం లేని జీవిత ప్రయోజనాలను తెలిపే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మైనర్లకు మద్యం విక్రయిస్తే మద్యం షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల కళాశాలలలో ఆల్కహాల్ వ్యతిరేక అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు.

ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలలో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మద్యపాన వినియోగం వల్ల కలిగే అనారోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలని అన్నారు. మందు తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులపై గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలు, కేర్ కమిటీ సభ్యులు సూచించిన సలహాలు తీసుకొని మద్యపాన వినియోగంపై గట్టి చర్యలు చేపడతామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్, డీఈఓ షంషుద్దీన్, జిల్లా విద్యా ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, జిల్లా కో–ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ హిమాదేవి, సూపరింటెంట్ ఆఫ్ సైక్రియాటిస్ట్ డా.వెంకట రాముడు,జనరల్ హాస్పిటల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ జమున తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో 94 శాతం ఉత్తీర్ణత

23వ ర్యాంకు సాధించిన జిల్లాకు చెందిన షేక్ ఖాదర్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం ప్రభుత్వం నిర్వహించిన పాలిసెట్–2025 ప్రవేశ ఫలితాలు బుధవారం సాయంత్రం విడుదలయ్యాయి. మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుకు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఏప్రిల్ 30న కడప, ప్రొద్దుటూరులలోని 16 కేంద్రాలలో నిర్వహించిన పాలిసెట్ పరీక్షను 7271 మంది రాయగా 6860 మంది పాసై 94.35 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఇందులో బాలురు 3942 మంది పాసై 93.3 శాతం ఉత్తీర్ణతను బాలికలు 2918 మంది పాసై 95.8 శాతం ఉత్తీర్ణతను సాధించారు. వైఎస్సార్‌జిల్లాకు సంబంధించి షేక్ ఖాదర్‌బాషా 119 మార్కులు సాధించి జిల్లా లో టాపర్‌గా నిలిచి రాష్ట్ర స్థాయిలో 23వ ర్యాంకును సాధించాడు. అలాగే వెన్నపూస చంద్రకళ జిల్లాలో ద్వితీయ స్థానం, రాష్ట్రంలో 72వ ర్యాంకు, మోపూరి శ్రావణ్‌కుమార్ జిల్లాలో తృతీయ స్థానం, రాష్ట్రంలో 76వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించారు.

ఖరీఫ్ ప్రణాళిక ఖరారు

- జిల్లాకు విత్తనాలు, ఎరువులు కేటాయింపు
- 3253 క్వింటాళ్లు వేరుశనగ క్కాయలు
- 1537 క్వింటాళ్లు జీలుగలు, 2982 క్వింటాళ్లు జనుములు
- 92000 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరంగా ప్రతిపాదనలు
- ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,28,084 హెక్టార్లో పంటల సాగు ఖరారు



రైతులకు అందించనున్న ఎరువులు

కడప అగ్రికల్చర్ : ఖరీఫ్ సీజకు ప్రణాళిక ఖరారైంది. మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఇరిగేటెడ్, నాన్ ఇరిగేటెడ్‌కు కింద జిల్లాలో 1,28,084 హెక్టార్లలో వివిధ పంటల సాగు లక్ష్యంగా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి రైతన్నలకు ఏ మేరకు విత్తనాలు అవసరమో ప్రణాళికలను పంపి విత్తనాలను తెప్పించి రైతులకు సబ్సిడీ కింద అందించనుంది. అలా సబ్సిడీతో ఇచ్చే విత్తనాల కేటాయింపులో ఈసారి కూటమి ప్రభుత్వం కోత పెట్టింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

కేటాయింపుల్లో కోత..

జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లా రైతులకు సబ్సిడీ కింద 12252 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాకు కేటాయించింది. అలాంటిది ఈ ఏడాది ఖరీఫ్‌కు వైఎస్సార్‌జిల్లా రైతులకు 11432 క్వింటాల్లు రాయితీ విత్తనాలు అవసరమవుతాయని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇందులోనూ కూటమి ప్రభుత్వం కోత వేసి విత్తనాలను కేటాయించింది. జూన్ నుంచి ప్రారంభంకానున్న ఖరీఫ్–2025కు సంబంధించి జిల్లాకు మెత్తంగా 11432 క్వింటాళ్ల విత్తనాలు అవసరంకాగా అందులో 8591.55 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది.

ఖరీఫ్‌కు కేటాయించిన ఎరువుల వివరాలు ఇలా..

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించి నెలల వారీగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఖరీఫ్ సీజన్ మొత్తానికి 73,582 మెట్రిక్ టన్నుల ఎరువులను అవసరంగా వ్యవసాయ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలను సమర్పించారు. ఎరువులకు సంబంధించి ఖరీఫ్ సీజన్‌కుగాను 32000 మెట్రిక్ టన్నుల యూరియా, 10000 మెట్రిక్ టన్నుల డీఏపీ, 5000 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 5000 మెట్రిక్ టన్నుల సింగల్ సూపర్ పాస్పేట్, 40,000 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను అవసరంగా గుర్తించి నివేదికలను ప్రభుత్వానికి నివేదించారు.

ఖరీఫ్‌లో సాగయ్యే ప్రధాన పంటల వివరాలు ఇలా..

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రధాన పంటలైన వరి 30,804 హెక్టార్లలో, మిల్లెట్స్ 34,472, మినుము 3806, కంది 5761, మిరప 1679, పసుపు 2229, ఉల్లి 5203, టమాట 1329, వేరుశనగ 5976, పొద్దుతిరుగుడు 1142 హెక్టార్లలో సాగుకానున్నాయి.

ఖరీఫ్‌కు విత్తన కేటాయింపులు
క్వింటాళ్లలో..

విత్తనాలు	కేటాయింపు
జీలుగ	1537
జనుములు	2982
పిల్లపెసర	48
మినుము	268
పచ్చపెసలు	25
కందులు	478.55
వేరుశనగ	3253
మొత్తం	8591.55

కోళ్ల వేస్టు.. కొల్లగొట్టు!

- చికెన్ వ్యర్థాల తరలింపులోనూ కమీషన్ల కక్కుర్తి..
- నెలకు రూ.2.10 లక్షలు చెల్లించి తీసుకెళుతున్న కాంట్రాక్టర్



కోళ్ల వ్యర్థాలను చికెన్ సెంటర్ల నుంచి సేకరించి మినీ లారీలో తీసుకెళుతున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న చందంగా అధికారముండగానే నాలుగు రూపాయలు పోగు చేసుకోవడానికి అధికార పార్టీ నేతలు ఆరాటపడుతున్నారు. ఇసుక దందాల్లో మునిగితేలుతున్నారు.. స్థలాల ఆక్రమణల్లో చక్రాలు తిప్పుతున్నారు... చివరికి కోళ్ల వేస్టేజీని వదలట్లేదు. అవును.. కోళ్ల వ్యర్థాలను తీసుకెళ్లే కాంట్రాక్టర్‌తో నెలకు రూ.2.10 లక్షలు చెల్లించేలా ఓ ప్రజాప్రతినిధి పీఏ ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం.

ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో దాదాపు 200 చికెన్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో సుమారు 50 పెద్ద చికెన్ సెంటర్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజు పెద్ద ఎత్తున కోళ్ల పేగులు, తలకాయలు లాంటి వ్యర్థ పదార్థాలు పేరుకుపోతాయి. తొలగించిన వ్యర్థాలను చేపల చెరువుల్లో ఆహారంగా వినియోగిస్తున్నారు. చాలా ఏళ్లుగా మైలవరం, జమ్మలమడుగు ప్రాంతాల్లో చేపల చెరువులు నిర్వహిస్తున్న ఓ కాంట్రాక్టర్ రోజు వీటిని చికెన్ సెంటర్ల నుంచి సేకరించి తీసుకెళ్లడం, చేపలకు ఆహారంగా వేయడం జరుగుతోంది. మినీ లారీని ఏర్పాటు చేసి 12 డ్రమ్ముల్లో రోజు ఉదయాన్నే చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను తరలిస్తున్నారు. కోళ్ల వ్యర్థాలు పేరుకుపోతే తమకు ఇబ్బందులు ఎదురవుతాయన్న కారణంతో వ్యాపారులు ఉచితంగా ఇవ్వడం, కాంట్రాక్టర్ తీసుకెళ్లడం ఆనవాయితీగా జరుగుతుండేది.

మహిళా నేత పోటీ

నంద్యాలకు చెందిన అధికార పార్టీ మహిళా నేత ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నంద్యాల, రుద్రవరం తదితర ప్రాంతాల్లో చేపల చెరువులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆమె నంద్యాలతోపాటు ప్యాపిలి, డోన్, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లోని చికెన్ సెంటర్ల నుంచి కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. తాజాగా ఆ మహిళా నేత కన్ను వ్యాపార కేంద్రమైన ప్రొద్దుటూరుపై పడింది. పట్టణంలో ఎక్కువ మొత్తంలో కోళ్ల వ్యర్థాలు వస్తున్నాయని తెలుసుకుని స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధి వద్ద ఇటీవల పంచాయితీ నిర్వహించినట్లు సమాచారం. మీరు రెకమెండ్ చేస్తే రోజు ప్రొద్దుటూరు నుంచి నంద్యాలకు కోళ్ల వ్యర్థాలను తీసుకెళుతానని ఆమె తన పరిధిలో పలుకుబడిని ఉపయోగించారు. ప్రజాప్రతినిధి ప్రముఖ చికెన్ సెంటర్ల నిర్వాహకుల ద్వారా విషయం తెలుసుకున్నారు. నంద్యాల నుంచి వచ్చి కోళ్ల వ్యర్థాలను తీసుకెళ్లడం కష్టమని, గంటగంటకు వ్యర్థాలు పేరుకుపోతే దుర్వాసనతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని వ్యాపారులు ప్రజాప్రతినిధికి చెప్పినట్లు తెలిసింది. వ్యాపారుల ఇష్ట ప్రకారమే తప్ప ఇందులో తమ ప్రమేయం ఏమి ఉండదని ప్రజాప్రతినిధి ఆమెకు తెలిపారు. జమ్మలమడుగు ప్రాంతం దగ్గర కావడంతో పాత కాంట్రాక్టర్ తీసుకెళ్లడానికి సులువుగా ఉంటుందని వ్యాపారులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. యథావిధిగా పాత కాంట్రాక్టర్ రోజు ఈ వ్యర్థాలను తీసుకెళుతున్నారు. కాగా సందట్లో సడేమియా అన్న చందంగా ప్రజాప్రతినిధికి అనధికారిక పీఏగా పనిచేస్తున్న ఓ వ్యక్తి ఒప్పందం కుదుర్చుకుని ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్ ద్వారా నెలకు రూ.2.10 లక్షలు చెల్లించేటట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎక్కడా అధికారులు, పోలీసులు పట్టుకోకుండా మేనేజ్ చేస్తానని సదరు పీఏ హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్ అంగీకరించారు. ఇందులో రూ.1.80లక్షలు పీఏకు, రూ.30వేలు పోలీసులకు ప్రతి నెల ఇచ్చేటట్లు ఒప్పందం కుదిరింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధి స్పందించి కోళ్ల వ్యర్థాలకు సంబంధించిన అంశాన్ని మున్సిపాలిటీకి అప్పగిస్తే ప్రతినెలా ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

క్లుప్తంగా

అల్లదిగో.. వేంకటేశ్వరుడు!



కల్పవృక్ష వాహనంపై వస్తున్న నారాపుర వేంకటేశ్వరుడు

జమ్మలమడుగు : విశ్వావసు నామ సంవత్సరం వైశాఖ మాసంలో జరిగే శ్రీ నారాపుర స్వామి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం శ్రీ నారాపుర వేంకటేశ్వర స్వామి భక్తులకు ఉదయం కల్పవృక్ష వాహనంపై, సాయంత్రం హనుమంత వాహనంపై దర్శనం ఇచ్చారు. స్వామి వారికి పల్లకీలో పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకీ వెంట భక్తులు కోలాటం ఆడుతూ, అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తూ కదిలారు. దేవదేవు డుఇంటి ముందుకు కల్పవృక్ష వాహనంపై రావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల్లో హుండీల చోరీ



గడ్డివాములో హుండీని పారేసిన దుండగులు

కలసపాడు : మండలంలోని పాత రామాపురం, ఈ. రామాపురం గ్రామాలలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీ అభయాంజనేయ స్వామి, శివాలయం, దేవాలయంలో గుడి తాళాలు పగలగొట్టి హుండీలో ఉన్న నగదు దొంగిలించారు. గుడి పూజారి రాళ్లపల్లె ప్రభు కలసపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసులు, కలసపాడు ఎస్‌ఐ తిమోతి సంఘటన స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఘాట్ రోడ్డులో కారు దగ్ధం



ఘాట్ రోడ్డులో దగ్ధమవుతున్న కారు

ముద్దనూరు : ముద్దనూరు – జమ్మలమడుగు ఘాట్ రోడ్డులో బుధవారం తెల్లవారుజామున కారులో మంటలు చెలరేగాయి. కొండాపురం నుంచి జమ్మలమడుగు వైపు ప్రయాణిస్తున్న కారు ఘాట్ రోడ్డులో సగం దూరం వెళ్లే సరికి బ్యానెట్ నుంచి పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై కారును నిలిపివేశాడు. బ్యానెట్ తెరచిన తర్వాత మంటలు వ్యాపించడంతో అతను కారుకు దూరంగా పరిగెత్తాడు. దీంతో కారులో తీవ్రంగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

టిప్పర్ ఢీకొని ట్రాక్టర్ బోల్తా



రోడ్డుపై అడ్డదిడ్డంగా పడిన వరి గడ్డి

చింతకొమ్మదిన్నె : వరి గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక వైపున టిప్పర్ ఢీకొనడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్ నగర్ వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో వరిగడ్డి కట్టలు చెల్లాచెదురయ్యాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోయినా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

'మహానాడు'లో ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా చర్యలు



మహానాడు భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ




సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ దిశానిర్దేశం

కడప అర్బన్ : మహానాడు సందర్భంగా ఈనెల 27, 28, 29 తేదీలలో పటిష్ట బందోబస్తుతో పాటు, ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పలు అంశాలపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మహానాడుకు పలువురు వీవీఐపీలు, వీఐపీలు, పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ పరంగా ఎలాంటి అవాంతరాలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. పోలీస్ అధికారులకు కేటాయించిన విధులను అప్రమత్తంగా ఉంటూ నిర్వర్తించాలన్నారు. ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్, కడప డీఎస్పీ జి.వెంకటేశ్వర్లు, ఏ.ఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర రావు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, ఎస్.బి ఇన్‌స్పెక్టర్ ఆర్.పురుషోత్తం రాజు, జిల్లాలోని సీఐలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ఆస్పత్రిలో గుర్తు తెలియని మృతదేహాలు





మృతి చెందిన సుబ్బరాయుడు, బ్రహ్మయ్య

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో ఇరువురు గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలను భద్రపరిచారు. సుబ్బరాయుడు (60) అనే వ్యక్తి అనారోగ్యం కారణంగా ఈ నెల 12న జిల్లా ఆస్పత్రిలోని ఎంఎం–2 వార్డులో చేరాడు. మంగళవారం మృతి చెందాడు. ఐపీ రిజిష్టర్‌లో అతని పేరు మినహా ఊరు పేరు, సెల్ నంబర్ లేకపోవడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అలాగే బ్రహ్మయ్య (70) అనే వ్యక్తి ఈ నెల 11న అనారోగ్యంతో జిల్లా ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ 12న అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. మృతుల బంధువులు తమను సంప్రదించాలని మార్చురీ ఇన్‌చార్జి వరాలు తెలిపారు.

పంచాయతీ కార్మికులకు అడ్వాన్సుగా రూ.10.30 లక్షలు



డీఎల్‌పీఓ రమాదేవికి డబ్బులను అందిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు

వేంపల్లి : వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు తన సొంత నిధులను అడ్వాన్సుగా రూ.10.30లక్షలను అందజేశారు. పంచాయతీ ఈఓ సెలవుపై వెళ్లడంతో గత ఐదు నెలలుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో వేంపల్లె గ్రామ పంచాయతీకి ఇన్‌చార్జిగా ఉన్న పులివెందుల డీఎల్‌పీఓ రమాదేవి సర్పంచ్ ఇచ్చిన రూ.10.30 లక్షలలో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున 103 మందికి అందజేశారు. దీంతో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. గత పది రోజుల క్రితం విధుల్లోకి చేరిన ఈఓ రామసుబ్బారెడ్డి తన సొంత పనుల కోసం సెలవుపై వెళ్లారు. అయితే ఆయన ఈనెల 26వ తేదీన విధుల్లోకి వస్తారని డీఎల్‌పీఓ తెలిపారు. ఈఓ విధుల్లోకి వచ్చిన అనంతరం సర్పంచ్‌కు రూ.10.30లక్షలను చెల్లిస్తామని తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం

కడప అర్బన్ : వీరపునాయునిపల్లె మండలం బూసిరెడ్డిపల్లెకు చెందిన వడ్డారపు గంగరాజు (60) అనే వ్యక్తిపై ఈనెల 13వ తేదీన సూరారెడ్డి అనే వ్యక్తి హత్యాయత్నం చేశాడు. తమ పొలంలో పనులు చేసుకుంటూ ఉండగా, పాతకక్షలను మనసులో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన సూరారెడ్డి రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడిని తొలుత వేంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుడి వెన్నెముక తీవ్రంగా దెబ్బతిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంఘటన జరిగిన తరువాత తాము పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు నిందితులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు. పోలీసులు చర్యలు తీసుకుని తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డు నుంచి అగ్రహారం వెళ్లే దారిలో బుధవారం రాత్రి ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. పోరుమామిళ్ల మండలం పెన్నంవారిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున, కిషోర్ అనే ఇద్దరు యువకులు ఓ పని నిమిత్తం తమ ద్విచక్ర వాహనంలో పట్టణానికి వచ్చి తిరిగి వెళుతుండగా బైపాస్‌రోడ్డు మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

చిన్నారుల మృతిపై మంత్రుల సంతాపం

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లెపల్లె చెరువులో ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు మృతి చెందడంపై రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, సవిత సంతాపం వ్యక్తం చేశారు. చిన్నారుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. సెలవులకు వచ్చిన బాలురు ఇలా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని తెలిపారు. వేసవి సెలవులు కావడంతో, విద్యార్థులు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరు



ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఆర్టీసీ ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప డిపో ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ అధికారుల తీరును నిరసిస్తూ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప డిపో మేనేజర్, టీఐ3 ఇరువురు కడప డిపో ఉద్యోగుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి కార్మికుల ఆమోదయోగ్యమైన కోర్కెలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు, రీజియన్ సంయుక్త కార్యదర్శి కేఎస్ దాస్, కోశాధికారి టీఎం బాషా, వైస్ ప్రెసిడెంట్ పీఎస్ ఖాన్, కేఎంఎస్ రావు, రామయ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సిపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : విజయవాడలోని 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ – టెక్నాలజీ (సీఐపీఈటీ)లో 10వ తరగతి విద్యార్హతతో పలు డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో 2 సంవత్సరాలు వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ) అనే మూడు కోర్సులకు ఆన్‌లైన్ విధానంలో https://cipet25.onlineregistrationform.org/CIPET/ అనే లింకు ద్వారా ఈనెల 29 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సిపెట్ అడ్మిషన్ టెస్ట్ (కాట్)ను జూన్ 8 తేదీ నిర్వహించి అందులో వచ్చిన ర్యాంక్ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు డి. భాస్కర్ 9704646998 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఏటీఎం చోరీకి యత్నం



ఏటీఎంను పరిశీలిస్తున్న క్లూస్ టీం

ముద్దనూరు : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఏ1 బ్యాంకు ఏటీఎం చోరీకి దుండగులు యత్నించారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో దుండగులు ఏటీఎంలోకి చొరబడి ఏటీఎం బాక్స్‌ను పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లేదుకు యత్నించినట్లు తెలుస్తోంది. అయితే ఏటీఎంలో నగదు ఉంచే బాక్స్‌ను వారు తెరవలేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం బృందం వచ్చి వివరాలు సేకరించారు.

కుటుంబ 'సమ్మె'తంగా..

17వ రోజుకు చేరిన 'సీహెచ్‌ఓ'ల ఆందోళన



తమ చిన్నారులతో ఆందోళన చేపడుతున్న సీహెచ్‌ఓలు

కడప రూరల్: వైఎస్సార్ కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)ల సమ్మె కొనసాగుతోంది. ఏపీ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షురాలు కె.గిఫ్టీ షీలా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమ్మె బుధవారం 17వ రోజుకు చేరింది. 90 శాతానికి పైగా సీహెచ్‌ఓలు దాదాపుగా ఉద్యోగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జీతం వస్తే గాని జీవనం గడవని పరిస్థితి. సమ్మెలో ఉన్న ఉద్యోగులకు ఇంత వరకు ప్రభుత్వం ఒక నెల వేతనాలు మంజూరు చేయలేదు. కడప కలెక్టరేట్ వద్ద జరిగే కార్యక్రమాలకు చాలా మంది సీహెచ్‌ఓలు మండు టెండలను సైతం లెక్క చేయకుండా తమ పిల్లలతో వచ్చి ఆందోళనలో పాల్గొంటున్నారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తే తమ పిల్లలకు, కుటుంబానికి భద్రత ఉంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శిబిరంలో ఉన్న చిన్నారులు, అటుగా వెళ్లేవారిని ఆకర్షిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

రాజంపేట : రాజంపేట పట్టణ శివారులోని రామ్‌నగర్‌కు చెందిన ఓ వివాహిత నరసమ్మ (45) పోలి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తన భర్త మద్యానికి బానిసై నరసమ్మతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంతో ఇంటికి రాడనే మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోమటివానిచెరువులో వృద్ధురాలి మృతి

మదనపల్లె రూరల్ : మదనపల్లె పట్టణంలోని కోమటివానిచెరువులో వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పట్టణంలోని రెడ్డెప్పనాయుడు కాలనీకి చెందిన రత్నాకర్ ఆచారి భార్య డి.లక్ష్మీదేవమ్మ(80) గత కొంతకాలంగా మానసిక స్థితి బాగోలేక అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి కనిపించకుండా పోయిన లక్ష్మీదేవమ్మ సాయంత్రం 5 గంటల సమయంలో కోమటివానిచెరువులో శవమై తేలింది.

యువకుడి దారుణ హత్య

వివాహేతర సంబంధమే కారణం



చంటి(ఫైల్)

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం కోమటిపేటకు చెందిన కందుల చంటి (31) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే కారణమని గ్రామస్తులతో పాటు పోలీసులు పేర్కొంటున్నారు. గ్రామస్తులు, చక్రాయపేట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు చంటి కట్టెలు కొట్టడంతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లేవాడు. ఇతను సురభి గ్రామం రెడ్డివారిపల్లె సమీపంలోని హరిజనవాడకు చెందిన ఓ వితంతుతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆ మహిళ అంతకు ముందు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండేది. దీంతో సదరు వ్యక్తి చంటిపై కక్ష పెంచుకొని మరి కొందరి సహకారంతో కాపు కాచి దేవరగుట్టపల్లె సమీపంలో మంగళవారం రాత్రి రాళ్లతో దాడిచేసి ట్రాక్టరుతో తొక్కించి పరారయ్యాడు. చంటి గాయాలతో ఉన్న విషయం తెలుసుకొని కుటుంబీకులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి కడప రిమ్స్‌కు తరలించారు. అదే రోజు రాత్రి అతను మృతి చెందాడు. మృతుడి భార్య కందుల ఉమ తన భర్త హత్యకు దర్శనమ్మతో పాటు మరి కొందరు కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కాగా మృతుడికి భార్యతో పాటు నాలుగేళ్ల లోపు ఉన్న ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ పోషకుడు చనిపోవడంతో భార్యా పిల్లలు అనాథలయ్యారని గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఉపాధి హామీ అక్రమాలపై విచారణ జరపాలి

కలెక్టర్‌కు ఎంపీ అవినాష్‌రెడ్డి లేఖ



కడప సెవెన్‌రోడ్స్/పులివెందుల : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు.

బుధవారం కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరికి ఈ మేరకు ఆయన లేఖ రాశారు. జిల్లాలో లేని వారికి, అధికార పార్టీ నాయకులకు చెందిన అనుచరులకు ఫేక్ జాబ్‌కార్డులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. అర్హత కలిగిన కూలీలను విస్మరిస్తున్నారని తెలిపారు. అటెండెన్స్ రికార్డుల్లో అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. ఒకే ఫొటోలను మస్టర్‌లో ఇతర పేర్లతో పొందుపరుస్తున్నారని తెలిపారు. పనులు చేపట్టకపోయినప్పటికీ వేతనాలు విడుదల చేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే నకిలీ డాక్యుమెంట్ల ఆధారంగా తరచూ ఇలాంటి పేమెంట్లను విడుదల చేస్తున్నారని ఆరోపించారు. కువైట్ వంటి ఇతర దేశాల్లో నివసిస్తున్న వారి పేర్లను కూడా మస్టర్ రోల్స్‌లో చూపుతున్నారని పేర్కొన్నారు. సామాజిక తనిఖీ యంత్రాంగం పూర్తిగా నిర్వీర్యమైందని, ఇలాంటి అవకతవకలను వెలికి తీయడంలో విఫలమైందన్నారు. చక్రాయపేట మండలం కుప్పం పంచాయతీ పరిధిలో ఉపాధి పనుల్లో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయన్నారు. ఫేక్ ఎంట్రీస్, ఒకే విధమైన ఫొటోలు, తప్పుడు మస్టర్లు వంటివి నిత్యకృత్యమయ్యాయన్నారు. ఉపాధి హామీ మస్టర్ రోల్స్, జాబ్‌కార్డు రికార్డులు, వేతన పంపిణీ అంశాల్లో గత మూడేళ్లుగా చోటుచేసుకున్న అక్రమాలపై తక్షణమే జిల్లా స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. ఉపాధి పనుల అవకతవకలకు కారణమైన పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేయాలని కోరారు. స్వతంత్ర విచారణ కమిటీని నియమించి థర్డ్ పార్టీ అబ్జర్వర్లను కూడా అందులో నియమించాలన్నారు. ప్రస్తుతం పూర్తయిన, జరుగుతూ ఉన్న పనులపై రీ ఆడిట్ నిర్వహించాలన్నారు. సోషల్ ఆడిట్ టీములను పునరుద్ధరించాలన్నారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖకు సమర్పించి ఉపాధి హామి పనుల్లో జరుగుతున్న అవకతవకలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ఫలితాల్లో విశ్వం విజయకేతనం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు.

ఏప్రిల్ 25న నిర్వహించిన ఏపీఆర్‌జేసీ పరీక్షా ఫలితాల్లో వై.దేదీప్య రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, కె.మునిరూపేష్ 7వ ర్యాంకు, జె.అంజలి 9వ ర్యాంకు, మనీషా 10వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. వీరితో పాటు రేవంత్, అబ్దుల్ ఖాదర్, యోగి, సమత, భవ్యశ్రీ గీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ తదితరులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే పాలిసెట్ ఫలితాల్లో ఎం.కావ్య 120 మార్కులకు 117 మార్కులు సాధించి బాలికల విభాగంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. అలాగే కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్ ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారీలు 112, ఎన్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109 మార్కులతో జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ తులసీ విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూలో 12 విభాగాలకు ఏఐసీటీఈ అనుమతి

కడప ఎడ్యుకేషన్ : కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో 2025–2026 విద్యా సంవత్సరానికి 12 టెక్నికల్ విభాగాలన్నింటికీ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి అనుమతి పొడిగింపు (ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అప్రువల్) వచ్చిందని వైస్ చాన్సలర్ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. 2023లో మొదటిసారిగా లెటర్ ఆఫ్ అప్రూవల్ (ఎల్‌ఓపీ) పొందిన ఈ కోర్సులు విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం అనుమతిని విజయవంతంగా పొందుతున్నాయన్నారు.

అనుమతి పొందిన విభాగాలలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ), కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (సీఎఫ్ఏ) రెండూ ఉన్నాయి. అలాగే ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ప్రోగ్రాం, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఫెసిలిటీస్ అండ్ సర్వీసెస్ ప్లానింగ్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఇంటీరియర్ డిజైన్, ఫైన్ ఆర్ట్స్ ప్రోగ్రామ్స్, అప్లైడ్ ఆర్ట్, ఆనిమేషన్, పెయింటింగ్, స్కల్ప్చర్, ఫొటోగ్రఫీ విభాగాలు ఉన్నాయని వైస్ చాన్సలర్ తెలిపారు. ఏఐసీటీఈ అనుమతి ప్రక్రియలో క్రియాశీలక పాత్ర పోషించిన కమిటీ సభ్యులు బి. నారాయణ రెడ్డి (కోఆర్డినేటర్), పి.ప్రసన్న కుమారి, ఎస్.దినేష్ కుమార్, అన్ని విభాగాల కోఆర్డినేటర్లు, బోధన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష



నిందితుడు సురేష్(ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడురోడ్ల సమీపంలో జనతా మెడికల్ స్టోర్ వద్ద నివాసముంటున్న సులోచనపై అతని సోదరుడు, సిద్దవటం మండలం మంగనవాండ్లపల్లికి చెందిన కారుమంచి సురేష్ అలియాస్ హరిప్రసాద్ నాయుడు 2020 ఫిబ్రవరి 2వ తేదీన మటన్‌కొట్టే కత్తితో తలపై, భుజంపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలు సులోచనకు ఆమె భర్త రాఘవరెడ్డి చికిత్స చేయించారు. కేవలం తన అవసరాలకు డబ్బులు ఇవ్వలేదని సోదరుడు ఈ చర్యకు పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బి.మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఈ సంఘటనపై నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు, రూ.70 వేలు జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సివిల్ జడ్జి జి.జి ఆసిఫా సుల్తానా తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.శ్రీనివాసులు తమ వాదనలను వినిపించారు. ఈ కేసు వివరాలను ప్రస్తుత సీఐ బి. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తగిన సాక్ష్యాధారాలతో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ అభినందించారు.